# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 69 | పేజీలు: 4 | వెల: 4/- | మంగళవారం • 01, అక్టోబర్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి




## మెట్రో ఆఫర్ గడువు మార్చి వరకు పొడిగింపు

**హైదరాబాద్,సెప్టెంబర్ 30(నమస్తే ఉదయం):** ప్రయాణికులకు హైదరాబాద్ మెట్రో రైలు గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రయాణికులకు అందిస్తున్న ఆఫర్లను పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది.

ఈ మేరకు 2025 మార్చి 31 వరకు ఆఫర్లను పొడిగించినట్లు సంస్థ ప్రకటించింది. ప్రస్తుతం అందిస్తున్న సూపర్ సేవర్-59, స్టూడెంట్ పాస్, సూపర్ సేవర్ ఆఫ్ పీక్ ఆఫర్లను పొడిగించింది. అక్టోబర్ 6 నుంచి నాగోల్, మియాపూర్ మెట్రో స్టేషన్లలో నామమాత్రపు పార్కింగ్ ఫీజు వసూలు చేయనున్నట్లు ప్రకటించింది. ప్రయాణికుల సౌలభ్యం, భద్రత కోసమే ఈ రుసుము వసూలు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు మెట్రో ఎండీ కేవీబీ రెడ్డి తెలిపారు.

### శని,ఆదివారాల్లోనే కూల్చివేతల

# మతలబు ఏంటి..?

- కూల్చివేతలకు ముందు ఓనర్లకు సమయం ఇవ్వరా
- చట్టప్రకారం నడుచుకోకపోతే హైడ్రాపైనే స్టే విధిస్తాం
- హైడ్రా కూల్చివేతలపై హైకోర్టు ఆగ్రహం
- వచ్చేనెల 15 వరకు విచారణ వాయిదా



**హైదరాబాద్,సెప్టెంబర్30(నమస్తే ఉదయం):** హైడ్రా తీరుపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో కూల్చివేతలపై పలువురు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై సోమవారం విచారణ జరిగింది. విచారణకు హైడ్రా కమిషనర్ రంగానథ్ వర్చువల్‌గా, అమీన్‌పూర్ తహసీల్దార్ కోర్టులో హాజరై వివరణ ఇచ్చారు. శని, ఆదివారాలు, సూర్యాస్తమయం తర్వాత ఎందుకు కూల్చివేతలు చేపడుతున్నారని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆదివారం మీరు ఎందుకు పని చేయాలని ప్రశ్నించింది. సెలవుల్లో ఎందుకు నోటీసులు ఇచ్చి, అత్యవసరంగా మిగతా..2లో



అత్తాపూర్ లక్ష్మీనగర్ పార్కులో బఫర్‌జోన్‌లో ఉన్న ఇండ్ల లబ్ధిదారుల బాధలు వింటున్న మాజీ మంత్రులు

### 55 రోజుల్లోనే

# డీఎస్సీ ఫలితాలు ఇచ్చాం..

- అక్టోబర్ 9న ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు
- త్వరలోనే గ్రూప్ 1 ఫలితాలు
- డీఎస్సీ-2024 ఫలితాల విడుదల కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి




**హైదరాబాద్,సెప్టెంబర్ 30(నమస్తే ఉదయం):** 11062 టీచర్ ఉద్యోగాల భర్తీకి విశేష కృషి చేసిన అధికారులకు నా అభినందనలు. 1:3 ప్రాతిపదికన ఫలితాలు ఫలితాలు విడుదల చేసాం. దసరా లోపు ఫైనల్ నియామకాలు పూర్తి చేస్తాం. అక్టోబర్ 9న ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు అందిస్తాం. గత ప్రభుత్వం పదేళ్లలో ఒకే ఒకసారి డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. పదేళ్లలో వాళ్లు చేపట్టిన ఉపాధ్యాయ నియామకాలు కేవలం 7,857 మాత్రమే. విద్యను అందుబాటులోకి తీసుకురావాలన్న ఆలోచన గత ప్రభుత్వానికి లేదు. మేం అధికారంలోకి రాగానే ఉపాధ్యాయ నియామ కాల ప్రక్రియ మొదలు పెట్టాం. విద్యకు మా ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చింది. నిర్వహణ నుంచి నియామ కాల వరకు 65 రోజుల్లో 11062 ఉద్యోగాల నియామకాలు పూర్తి చేస్తున్నాం. ఇది విద్యపై మా ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి. తెలంగాణలో పేదలకు విద్యను అందుబాటులోకి తీసుకురావాలన్నదే మా ఆకాంక్ష. అధికారంలోకి వచ్చిన 30 రోజుల్లోనే 30 వేల ఉద్యోగాల నియామక పత్రాలు అందించాం.

నిరుద్యోగులను దృష్టిలో ఉంచుకుని టెట్ నిర్వహణ తర్వాతే డీఎస్సీ నిర్వహించాం. టీజీపీఎస్సీని ప్రక్షాళన చేసాం. త్వరలోనే గ్రూప్ 1 ఫలితాలు ప్రకటించి తెలంగాణ పునర్నిర్మాణంలో వారిని కూడా భాగస్వామ్యం చేస్తాం.మొదటి ఏడాదిలోనే 60వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తున్నాం. టీచర్ ఉద్యోగం కేవలం ఒక ఉద్యోగం కాదు.. అది భావోద్వేగం. గత పదేళ్లలో విద్య నిర్లక్ష్యానికి గురైంది.. మేం వచ్చాక విద్య శాఖకు నిధుల కేటాయింపు పెంచాం. భవిష్యత్‌లో మరిన్ని నిధులు కేటాయిస్తాం. గత ప్రభుత్వం స్కూళ్లలో మౌలిక వసతులు కల్పించలేదు. అందుకే మా ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తోంది.. మిగతా..2లో

### మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు

# అండగా ఉంటాం..

### అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళతాం..

### బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

**రాజేంద్రనగర్, సెప్టెంబర్30(నమస్తే ఉదయం):** మూసీ పరివాహక ప్రాంతంలో ఉన్న 18, వేల ఇండ్లలో ఒక్క ఇల్లు కూడా కూల్చనీయమని, అవసరమైతే బీఆర్ఎస్ మూసీ నిర్వాసితులందరి తరపున సుప్రీంకోర్టు వరకు వెళ్లి పోరాడుతుందని బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ భరోసా కల్పించారు. సోమవారం సాయంత్రం అత్తాపూర్ లక్ష్మీ నగర్ పార్క్, కిషన్ బాగ్ ప్రాంతాల్లో మూసీ పరివాహక ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలతో కలిసి ఆయన వారి బాధలను విన్నారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ, 2020లో మాత్రమే ఒక్కసారి మూసీకి ఇబ్బందులు తలెత్తాయన్నారు.

కాంగ్రెసోళ్లే పర్మిషన్ ఇచ్చి, వాళ్లే రిజిస్ట్రేషన్ చేసి, వాళ్లే ఇళ్లను కూలగొడుతున్నారని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం లో కుడి చేయి ఏం చేస్తుందో...ఎడమ చేయికి తెలియటం లేదన్నారు.

రేవంత్ రెడ్డి ఒక అన్ ఫిట్, అసమర్థ సీఎం అని కేటీఆర్ దుయ్యబట్టారు. ఒక్క అత్తాపూర్ లో మార్కింగ్ ఇచ్చిన బిల్డింగ్ లకు సంబంధించి విలువ లెక్కిస్తే దాదాపు వెయ్యి కోట్ల వరకు ప్రజల ఆస్తి ఉంటుందన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ 2400 కిలోమీటర్లు ఉన్న నమామీ గంగే ప్రాజెక్ట్ కోసం రూ. 40 వేల కోట్లు ఖర్చు



కేటీఆర్‌ను పట్టుకుని ఏడుస్తున్న అత్తాపూర్‌కు చెందిన రేణుక

చేశారని, కేవలం 55 కిలోమీటర్ల మూసీ కి మాత్రం రూ. లక్షా 50 వేల కోట్లంట అని ఎద్దేవా చేశారు.

వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు ఇస్తా అని రేవంత్ రెడ్డి అన్నాడని, మరి ఆరు గ్యారంటీలు మిగతా..2లో

## ఢిల్లీకి వెళ్లిన సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,సెప్టెంబర్ 30(నమస్తే ఉదయం):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిల్లీకి బయల్దేరారు. ఇటీవల జమ్ముకశ్మీర్ ఎన్నికల ప్రచారంలో అస్వస్థతకు గురైన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను మంగళవారం ఆయన పరామర్శించనున్నారు. ఆ తర్వాత దిల్లీలోని పార్టీ ముఖ్యనేతలతో సమావేశం కానున్నారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన తదితర అంశాలపై ప్రతిపక్షాల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు ఎదురవుతున్న నేపథ్యంలో, ఈ నిర్ణయం తీసుకోవడం వెనక ఉన్న కారణాలను ఆయన అధిష్ఠానానికి వివరించే అవకాశముంది.



### భవానీ దీక్ష స్వీకరించిన

# కేంద్ర మంత్రి బండి సంజయ్

- 11 రోజులపాటు రాజకీయాలకు పూర్తి దూరం
- పూర్తిగా మహాశక్తి అమ్మవారి సేవకే పరిమితమైన సంజయ్
- 2011లో ఒక్కడితో మొదలైన బండి సంజయ్ భవానీ దీక్ష
- నేడు సంజయ్‌తోపాటు వేలాది మంది భవానీ దీక్ష స్వీకరణ
- 14 ఏళ్లుగా ప్రతి ఏటా క్రమం తప్పకుండా దీక్ష స్వీకరిస్తున్న సంజయ్
- నిత్యం వేలాది మందికి అన్నదానం చేస్తున్న బండి సంజయ్
- పేద, ధనిక తేడా లేకుండా పైసా ఖర్చు లేకుండా ప్రతి ఒక్కరూ దీక్ష చేపట్టేలా అన్నిరకాల ఏర్పాట్లు చేసిన కేంద్ర మంత్రి
- నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అత్యంత సుందరంగా ఆలయ ఆలంకరణ
- వెలుగు జిలుగులతో అలరారనున్న మహాశక్తి అమ్మవారి ఆలయం
- నిత్యం వేలాది మంది దర్శించుకునేలా ఏర్పాట్లు
- ప్రతిరోజు రాత్రి దాండియా ఉత్సవాలు నిర్వహించనున్న ఆలయ నిర్వాహకులు



**కరీంనగర్,సెప్టెంబర్ 30(నమస్తే ఉదయం):** శ్రీ దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఈరోజు ఉదయం కరీంనగర్ లోని మహాశక్తి అమ్మవారి ఆలయంలో 'భవానీ దీక్ష' చేపట్టారు.

ఆయనతోపాటు వందలాది మంది బీజేపీ కార్యకర్తలు, నాయకులు భవానీ దీక్ష చేపట్టారు. ఈరోజు నుండి విజయదశమి వరకు బండి సంజయ్ రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉంటారు. సామాన్య భక్తుడివలే మహాశక్తి అమ్మవారి సన్నిధిలోనే ఎక్కువ సమయం గడపుతూ అమ్మవారిని సేవిస్తారు.

బండి సంజయ్ భవానీ దీక్ష చేపట్టడం 14వసారి. మహాశక్తి అమ్మవార్ల ఆలయ ప్రతిష్ఠాత్మక మహోత్సవం సందర్భంగా 2011లో తొలిసారిగా బండి సంజయ్ 'భవానీ దీక్ష' చేపట్టారు. ఆనాడుతో ఆయనతోపాటు మరో ఐదారుగురు మాత్రమే ఆనాడు దీక్ష చేపట్టారు. అధ్యాత్మకంగా హిందువులందరినీ ఏకతాటిపైకి తీసుకురావాలని, పేద, ధనిక అనే తేడా లేకుండా అందరూ భవానీ దీక్ష చేపట్టాలనే ఉద్దేశంతో బండి సంజయ్ ప్రోత్సహిస్తున్నారు.


ఖర్చుతో పనిలేకుండా, భవానీ దీక్ష చేపట్టాలంటే దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా కరీంనగర్ లోని మహాశక్తి అమ్మవార్ల ఆలయంలోనే అన్ని ఏర్పాట్లు చేశారు. భవానీ దీక్ష చేపట్టే భక్తులందరికీ దేవాలయంలో చేపట్టే అన్ని రకాల పూజలు, సేవలు ఉచితంగా అందుబాటులో ఉంచారు. భగవంతుడికి భక్తులందరూ సమానమేనని చాటి చెప్పేందుకు ఎలాంటి రుసుం లేకుండా ఉచితంగా అమ్మవారిని దర్శించుకునేలా చర్యలు తీసుకున్నారు.

బండి సంజయ్ ప్రోత్సహంవల్ల నేడు కరీంనగర్ లో దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మిగతా..2లో

## డిజిటల్ కార్డులపై 3నుంచి క్షేత్రస్థాయి పరిశీలన

### అధికారులలో మరోమారు సిఎం రేవంత్ సమీక్ష

**హైదరాబాద్,సెప్టెంబర్ 30(నమస్తే ఉదయం):** కుటుంబ డిజిటల్ కార్డుల పంపిణీ సమయంలో కుటుంబ సభ్యులు అంగీకరిస్తేనే కుటుంబం ఫొటో తీయాలని సీఎం రేవంత్‌రెడ్డి



అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం గుర్తించిన కుటుంబాన్ని నిర్ధరించాలన్నారు. కుటుంబ డిజిటల్ కార్డులపై సోమవారం సీఎం సమీక్ష నిర్వహించారు. డిజిటల్ కార్డుల కోసం సేకరించే వివరాలను అధికారులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అక్టోబరు 3 నుంచి 7 వరకు పైలట్ ప్రాజెక్టులో భాగంగా క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని సీఎం ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా 119 నియోజకవర్గాలు, 238 ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలి. కొత్త సభ్యులకు జత చేసి, చనిపోయిన వారిని తొలగించాలి. పైలెట్ ప్రాజెక్టులో ఎదురైన వివరాలతో నివేదిక తయారు చేయాలి. కుటుంబ సభ్యుల వివరాల మార్పులు చేర్పుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం సూచించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేక, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## కాశ్మీర్‌లో నేడు తుదివిడత పోలింగ్

### ఓటు హక్కు వినియోగించుకోవాలన్న ఇసి

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 30(నమస్తే ఉదయం):** జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల మూడోవిడత పోలింగ్ మంగళవారం జరుగనుంది. ఈ మేరకు ఇసి అన్నిఏర్పాట్లు చేసింది. మూడో విడత పోలింగ్ నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ కీలక సూచన చేశారు. ప్రజాస్వామ్య పండుగలో ఓటర్లు



పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అక్టోబర్ 1న తుది విడత పోలింగ్ జరుగనుంది. తొలి రెండు విడతల్లో రికార్డు మిగతా..2లో



# రేవంత్ నీకు రేషం ఉంటే దిగిపో..

- హైడ్రా బూచి చూపి బిల్డర్ల దగ్గర డబ్బులు వసూలు చేసి హైకమాండ్‌కి డబ్బులు పంపడానికి
- రుణమాఫీ చేయకుంటే నీ భరతం పట్టుడు ఖాయం
- రైతు హామీల సాధన సదస్సులో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

**హైదరాబాద్,సెప్టెంబర్ 30(నమస్తే ఉదయం):** రేవంత్ రెడ్డి అధికారం నెత్తికి ఎక్కి ఎవరినీ లెక్కజేయని స్థాయికి ఎదిగిండు. కేసీఆర్‌కి 6 ఏళ్లు పడితే.. రేవంత్ కి మూడు నెలలే పట్టింది. మోసానికి దగాకు మారుపేరు రేవంత్. రెండింటి కోసం రేవంత్ ఇదంతా చేస్తున్నాడు. హైడ్రా బూచి చూపి బిల్డర్ల దగ్గర డబ్బులు వసూలు చేసి హైకమాండ్ కి డబ్బులు పంపడానికి. మూసీ ప్రక్షాళన పేరుతో లక్షన్నర కోట్లలో వచ్చే కమీషన్ కోసం.

హైకోర్టు హైడ్రాపై స్పందించింది. ఈరోజు శుభదినం. హైకోర్టు తప్పు పట్టింది అధికారులను కాదు రేవంత్ రెడ్డిని. రేవంత్ నీకు రేషం ఉంటే దిగిపో.. మూసీ, హైడ్రా బాధితులకు మేము అండగా ఉంటాం. హామీల మీద రోడ్ మ్యాప్ ప్రకటించాలి. ఇప్పటివరకు ఎంత రుణమాఫీ అయ్యిందో పబ్లిక్ పోర్టల్లో పెట్టాలని డిమాండ్ చేస్తున్న.రుణమాఫీ చేయకుంటే నీ భరతం పట్టుడు ఖాయం. పేదల కన్నీళ్ళలో కాంగ్రెస్ కొట్టుకుపోతుంది బీ కేర్ ఫుల్.

మోసానికి, దగాకు మారుపేరు రేవంత్ . రాహుల్ గాంధీని కూడా బోల్తా కొట్టించారు. కేసీఆర్ కూడా అలవికాని హామీ ఇచ్చారు. అడ్రస్ లేకుండా పోయారు.రుణమాఫీ చేస్తా అంటే.. రేవంత్ ను నమ్మి రైతులు ఓట్లు వేశారు. కేసీఆర్ ను ఓడించాలని ప్రజలు, విద్యార్థులు, ప్రజాస్వామిక వాదులు కాంగ్రెస్ కు ఓటు వేశారు. ఆరు గ్యారంటీలలో ఒక్క ఉచిత బస్సు తప్ప ఏమీ అమలు కాలేదు. 17900 కోట్లు రుణమాఫీ మిగతా..2లో

# పట్టపగలే నగదు, బంగారు చోరీ

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 30(నమస్తే ఉదయం):**



పట్టపగలే చోరీ జరిగిన సంఘటన ఆదివారం కేటిదొడ్డి మండలంలోని యర్సన్ దొడ్డి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామంలో ఎవరు లేని సమయంలో ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న విలువైన బంగారు ఆభరణాలు నగదు ఎత్తుకెళ్లారు. కేటిదొడ్డి ఎస్ఐ బి.శ్రీనివాసులు కథనం మేరకు యర్సన్ దొడ్డి గ్రామంలోని రైతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి వ్యవసాయ పనులకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గమ నించిన దొంగలు పలు ఇండ్లలో చోరీ చేశారు. పనులు ముగించుకుని సాయంత్రం తమ ఇండ్లకు వచ్చిన బాధితుల ఇండ్ల తాళాలు పగులగొట్టి ఉండటం గమనించారు.

నాలుగు ఇండ్లలో చోరి జరుగగా మొత్తం రూ. 1,63,000 విలువ చేసే బంగారు అభరణాలు, నగదు ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న కేటిదొడ్డి ఎస్ఐ బి.శ్రీనివాసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, క్లూస్‌టీం ద్వారా వేలి ముద్రలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# ఉపాధి హామీ కూలీలకు ఈ ఏడాది అత్యధిక పని దినాలు

**- అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్**

**వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 30(నమస్తే ఉదయం):**
ఉపాధి హామీ కూలీలకు 2025-26 సంవత్సరంలో అత్యధిక పనిదినాలు కల్పించేందుకు పకడ్బందీగా ప్రణాళికలు చేసుకోవాలని అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు.



సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, జిల్లా పరిషత్, మండల అభివృద్ధి అధికారులు, ఎపీఒలతో సమావేశం నిర్వహించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2025-26 సంవత్సరానికి పనుల ఎంపికకు తయారు చేయవలసిన ప్రణాళిక, తయారులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పనుల ఎంపిక గ్రామ సభల నిర్వహణ పై అదనపు కలక్టర్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ ఉమాదేవి, జెడ్పి సీఈవో యాదయ్య, అడిషనల్ డి ఆర్ డి ఓ రామ మహేశ్వర్ రెడ్డి, ఎంపీడీవోలు, ఏపీవోలు, ఈవోలు, టిఏలు, మరియు ఎఫ్ఏలు పాల్గొన్నారు.

# ప్రజాహితమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**- సి డి సి మాజీ చైర్మన్ మూలమల్ల చంద్రశేఖర్ రెడ్డి**

**ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తోంది**

**కొత్తకోట, సెప్టెంబర్ 30(నమస్తే ఉదయం)::**
ప్రజాహితమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని సి డి సి మాజీ చైర్మన్ మూలమల్ల చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం దేవరకద్ర శాసనసభ్యులు జి మధుసూదన్ రెడ్డి సూచన మేరకు ప్రజా పాలనలో భాగంగా మహాలక్ష్మి పథకం ద్వారా రామకృష్ణాపురం గ్రామంలో లబ్ధిదారులకు రూపాయలు 500 కే సిలిండర్ లబ్ధిదారులకు సబ్సిడీ డిక్లరేషన్



మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేస్తున్న సి డి సి మాజీ చైర్మన్ మూలమల్ల చంద్రశేఖర్ రెడ్డి

పత్రాలు ఆయన మహిళలకు స్థానిక నాయకులతో కలిసి అందజేశారు.

ఈ కార్యక్రమంలో మదనాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మూలమల్ల వెంకటేశ్వర్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగరాజు యాదవ్, శివరాములు, భారతయ్య, కురుమూర్తి, సంధ్య పాగా వెంకటేష్, రియాజ్ ,మహమూద్, భరత్, విలేజ్ సెక్రటరీ , తదితరులు పాల్గొన్నారు.

# మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు అండగా ఉంటాం..

**(మొదటి పేజీ తరువాయి)**
అమలైనయా అని ప్రశ్నించారు. స్టాంప్ పేపర్లు, అఫిడవిట్లు, దేవుళ్ల మీద ఒట్లు వేసి మరి హామీలు ఇచ్చారని వాటిని మాత్రం అమలు చేయడం లేదన్నారు.

ఢిల్లీ కాంగ్రెస్ కు రూ. 25వేల కోట్లు పంపటానికే ఈ రూ. లక్షా 50 వేల కోట్లు ప్రాజెక్ట్ పెట్టుకున్నారని ఆరోపించారు.

కాంగ్రెస్ బుల్డోజర్లకు అడ్డుగా మేముంటాం. ధైర్యం కోల్పోకండి అంటూ కేటీఆర్ బాధితులకు భరోసా కల్పించారు. హైదరాబాద్ లో లక్షల మంది వాళ్ల ఇళ్ల కోసం ఆందోళన చెందుతున్నారన్నారు. హైదరాబాద్ లో ప్రజలు బీఆర్ఎస్ ను గెలిపించారని కక్ష పెట్టుకొని కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

ఉత్తరప్రదేశ్ లో బుల్డోజర్ రాజ్ నహీ చలేగా అని రాహుల్ గాంధీ అంటాడు. మరి తెలంగాణలో వారి అయ్యా జాగీరా బుల్డోజర్ రాజ్ నడిపించేందుకు? అని అన్నారు. సోషల్ మీడియాలో రేవంత్ ను తిడుతున్న తిట్లు చూస్తుంటే మనిషి అనేటోడు ఎప్పుడో సచ్చిపోతుండే అన్నారు. సీఎం సొంత ఇకు కూడా చెరువు, కుంటలోనే ఉంది. దాన్ని కూలగొట్టే దమ్ముందా నీకు అడిగారు.

దుర్గం చెరువులో వాళ్ల అన్న తిరుపతి రెడ్డి ఇళ్లు కూడా కూలగొట్టరంట అన్నారు.

వాళ్ల మంత్రులు, వాళ్ల ఎమ్మెల్యేలందరి ఇళ్లు హిమాయత్ సాగర్ చుట్టు ఉన్నాయన్నారు. ముందు వాటిని కూల్చాలన్నారు.

పేదలు, మధ్య తరగతి వాళ్లకు ఇళ్లు అనేది ఒక ఎమోషన్. అలాంటి ఇళ్లను కూలగొడితే వాళ్ల ఆశలను కూలగొట్టినట్లే అని గుర్తు చేశారు. హైడ్రా కమిషనర్ సిగ్గు లేకుండా మూసీ తో సంబంధం లేదని ఈరోజు ప్రకటన చేశారన్నారు.

మరి ఎందుకు మార్కింగ్ చేశారు. పీకనీకే మార్కింగ్ చేశారా అని ప్రశ్నించారు. 18వేల ఇళ్లు అంటున్నారు. ఏ ఒక్కరి ఇళ్లు కూడా కూల్చనివ్వం అన్నారు.

రూ. 5వేలు ఇస్తే మీరు మాట్లాడుతున్నారని అంటున్నారు. సిగ్గు లేకుండా ఓ మంత్రి ఇలాంటి ప్రకటనలు చేస్తున్నాడని బాధితులకు వివరించారు. ఎవరు భయపడవద్దని, అవసరమైతే బయటనుంచి కూడా ప్రజలను తీసుకొచ్చి మీకు అండగా మేము నిలబడతాం అన్నారు.

రేవంత్ రెడ్డి నువ్వు మగాడివైతే ముందు ఇచ్చిన హామీలు అమలు చేయ్ అని సవాల్ విసిరారు.

రేవంత్ రెడ్డి అన్నకు నాలుగు బెడ్ల రూమ్ ఇద్దాం. ఆయన ఇళ్లు మారతాడా చూద్దాం అన్నారు.

రైతుల శక్తి ముందు మోడీ ప్రభుత్వమే మూడు నల్ల చట్టాలను వెనక్కి తీసుకుంది రేవంత్ రెడ్డి ఎంత అన్నారు.

అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్తాం. మీరు ఒక్క పైసా కూడా ఖర్చు చేయాల్సిన అవసరం లేదని బాధితులకు భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమం బీఆర్ఎస్ యువనేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది.

కార్యక్రమంలో మాజీ మంత్రులు పి సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, గంగుల కమలాకర్, జగదీశ్వర్ రెడ్డితోపాటు బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, రాజేంద్ర నగర్‌కు చెందిన కొలన్ సుభాష్ రెడ్డి, పోరెడ్డి ధర్మారెడ్డి, రావుల జంగయ్య, ఎస్. వేణుగోపాల్ రెడ్డి, అక్కెం రాఘవేందర్ యాదవ్, లక్ష్మి రాజ్, గుమ్మడి కుమార్, సోమ శ్రీనివాస్ గుప్తా, ఎస్. వెంకటేష్, జాలిగం చిత్తారి తదితరులు పాల్గొన్నారు.

# శని,ఆదివారాల్లోనే కూల్చివేతల మతలబు ఏంటి..?

**(మొదటి పేజీ తరువాయి)**
కూల్చివేస్తున్నారని అడిగింది. శని, ఆదివారాల్లో కూల్చివేయొద్దని గతంలో కోర్టు తీర్పులున్నాయని గుర్తు చేసింది. కోర్టు తీర్పుల విషయం కూడా తెలియదా అని తహసీల్దార్‌ను ప్రశ్నించింది. గతంలో మీరు కూల్చివేసిన కేసుపై స్టే విధించిన విషయం తెలియదా? అని అడిగింది. చట్టప్రకారం నడుచుకోకపోతే ఇబ్బందులు పడాల్సి వస్తుందని తహసీల్దార్‌ను హెచ్చరించింది. రాజకీయ నేతలు, ఉన్నతాధికారులు చెప్పినంత మాత్రాన అక్రమంగా ముందుకు వెళ్లొద్దు. ఇల్లు కూల్చే ముందు యజమానికి చివరి అవకాశం ఏమైనా ఇచ్చారా? ప్రభుత్వ ఆస్తుల రక్షణ పేరుతో అమాయకులను ఇబ్బందులకు గురి చేస్తారా? అని ఉన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. కోర్టు అడిగిన ప్రశ్నలకే సమాధానం ఇవ్వాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు సూచించింది. కూల్చివేతకు యంత్రాలు, సిబ్బందిని కోరడంతో సమకూర్చామని బదులివ్వగా..చార్మినార్ కూల్చివేతకు తహసీల్దార్ యంత్రాలు, సిబ్బంది అడిగితే ఇస్తారా? అని హైకోర్టు ప్రశ్నించింది. హైడ్రా ఇదే విధంగా ముందుకు వెళ్తే స్టే ఇవ్వాల్సి వస్తుందని హెచ్చరించింది. ఖాళీ చేయనంత మాత్రాన అత్యవసరంగా కూల్చాల్సిన అవసరం ఏముంది?పొలిటికల్ బాస్‌లను సంతృప్తిపరిచేందుకు, పై అధికారులను మెప్పించేందుకు చట్టవిరుద్ధంగా పని చేయొద్దు. చనిపోయే వ్యక్తిని కూడా చివరి కోరిక అడుగుతారు కదా? ఆదివారం కూల్చివేతలు హైకోర్టు తీర్పునకు వ్యతిరేకమని తెలియదా? అధికారులు చట్ట వ్యతిరేకంగా పనిచేస్తే ఇంటికెళ్తారు.. జాగ్రత్త అంటూ హెచ్చరించింది. మూసీపై కూడా 20 లంచ్ మోషన్ పిటిషన్లు దాఖలయ్యాయి. ఇది అరుదైన కేసుగా భావించే అధికారులను విచారణకు పిలిచాం. జీవో ప్రకారం హైడ్రాకు ఎన్నో విధులు ఉన్నాయి. మిగతావి పట్టించుకోకుండా కూల్చివేతలపైనే దృష్టి పెట్టారు. ట్రాఫిక్ సమస్యపైనా హైడ్రాకు బాధ్యత ఉంది. కానీ దాని గురించి ఏమాత్రం పట్టించుకోవట్లేదు. మాదాపూర్‌లో ప్రయాణం ఎంత సమయం పడుతుందో తెలుసు కదా? నిబంధనలు పాటించకుంటే హైడ్రా ఏర్పాటు జీవోపై స్టే ఇవ్వాల్సి వస్తుంది. సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేస్తేనే సామాన్యులు ఇళ్లు నిర్మిస్తున్నారు. స్థానిక సంస్థ అనుమతి ఇస్తేనే ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపంతో సామాన్యులు నష్టపోవాల్సి వస్తోంది. ఆదివారం కూల్చివేతలు వద్దని త్రిసభ్య ధర్మాసనం తీర్పు ఉంది. అక్రమ నిర్మాణాలు అనిపిస్తే సీజ్ చేయవచ్చు కదా? హైడ్రా ఏర్పాటు అభినందనీయం.. పనితీరే అభ్యంతరకరం. అమీన్‌పూర్ తహసీల్దార్, హైడ్రా కమిషనర్ తీరు అసంతృప్తికరం. ఒక్కరోజులో హైదరాబాద్‌ను మార్చాలనుకోవడం సరికాదు. ఎఫ్టీఎల్ నిర్ధరించకుండా అక్రమాలు అని ఎలా తేలుస్తారని హైకోర్టు ప్రశ్నించింది. విచారణను అక్టోబర్ 15కు వాయిదా వేసింది. అప్పటివరకు యథాతథ స్థితి కొనసాగించాలని హైడ్రా, అమీన్‌ఫూర్ తహసీల్దార్‌ను ఆదేశించింది. కౌంటర్లు దాఖలు చేయాలని చెప్పింది. ప్రభుత్వ ఆస్తుల రక్షణ పేరుతో అమాయకులను ఇబ్బందులకు గురిచేస్తారా ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆదివారం కూల్చివేతలు హైకోర్టు తీర్పునకు వ్యతిరేకమని తెలియదా అంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు న్యాయమూర్తి ప్రశ్నించారు. అమీన్‌పూర్‌పైనే మాట్లాడాలని, కావూరిహిల్స్ గురించి అడగలేదంటూ కోర్టు అడిగిన ప్రశ్నలకే సమాధానం ఇవ్వాలని.. జంప్ చేయొద్దని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో విజ్ఞప్తి మేరకు చర్యలు తీసుకున్నామన్నా రంగనాథ్ వివరణపై అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మార్వో అడిగితే గుడ్డిగా చర్యలు తీసుకుంటారా అని ప్రశ్నించారు. ఎమ్మార్వో అడిగితే చార్మినార్, హైకోర్టును కూడా కూల్చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడ్రాకు ఇదే విధేంగా ముందుకు వెళ్తే స్టే ఇవ్వాల్సి వస్తుందన్నారు. కూల్చివేతలు తప్ప వేరే పాలసి లేదని, ఇది ప్రజల అభిప్రాయమన్నారు. ఈ సందర్భంగా కోర్టులను ఎంతో గౌరవిస్తున్నామని న్యాయమూర్తికి రంగనాథ్ తెలిపారు. మూసీపై కూడా 20 లంచ్‌మోషన్ పిటిషన్లు దాఖలయ్యాయని న్యాయ మూర్తి వెల్లడించారు. ప్రభుత్వ వ్యవస్థల మధ్య సమన్వయం లేదని చెప్పారు. ఇది అరుదైన కేసుగా భావించే అధికారులను విచారణకు పిలిచామన్నారు. అక్రమ నిర్మాణాలు అనిపిస్తే సీజ్ చేయవచ్చు కదా అన్నారు. హైడ్రా ఏర్పాటు అభినందనీయ మేనని, పనితీరే అభ్యంతరకమ న్నారు. అమీన్‌పూర్ ఎమ్మార్వో, హైడ్రా కమిషనర్ తీరు అసం తృప్తి కమరని చెప్పారు. ఎఫ్‌టీఎల్ నిర్ధారించకుండా అక్రమాలు అని ఎలా తేలుస్తారన్నారు. ఒక్క రోజులో హైదరాబాద్‌ను మార్చాలనుకోవడం సరికాదన్నారు.

# భవానీ దీక్ష స్వీకరించిన కేంద్ర మంత్రి బండి సంజయ్

**(మొదటి పేజీ తరువాయి)**
ఏటా వేలాది మంది భక్తులు 'భవానీ దీక్ష' చేపడుతున్నారు. ఎంపీగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా, జాతీయ ప్రధాన కార్యదర్శిగా, కేంద్ర మంత్రిగా బండి సంజయ్ అంచెలంచెలుగా ఎదుగుతున్నప్పటికీ భవానీ దీక్షను మాత్రం క్రమం తప్పకుండా కొనసాగిస్తూనే ఉన్నారు. బండి సంజయ్ నిత్యం బిజీగా ఉన్నప్పటికీ ఈ 11 రోజులు మాత్రం భవానీ దీక్ష చేస్తున్న భక్తులతో మమేకమై ఆలయంలోనే అమ్మవారిని సేవిస్తూ నిత్య పూజలు చేయనున్నారు. నవరాత్రి ఉత్సవాలు పూర్తయ్యే వరకు భవానీ దీక్ష చేపడుతున్న వేలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. దేవాలయ ఆవరణలో అన్నదానం ఏర్పాటు చేశారు. బండి సంజయ్ సైతం వారితో కలిసి భోజనం చేస్తారు.

# కాశ్మీర్‌లో నేడు తుదివిడత పోలింగ్

**(మొదటి పేజీ తరువాయి)**
స్థాయిలో పాల్గొన్న ఓటర్లకు రాజీవ్ కుమార్ అభినందనలు తెలిపారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 58.58 శాతం పోలింగ్‌తో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ శాతాన్ని పోల్చారు. మొదటి విడతలో 61.38 శాతం, రెండో విడతలో 57.3 శాతం పోలింగ్ నమోదైనట్టు చెప్పారు. ఓటింగ్ శాతం, అభ్యర్థుల సంఖ్య, ప్రచారం గణనీయంగా పెరగడాన్ని తాము గమినించామని, రెండు విడతల్లోనూ ఎన్నికలను బహిష్కరించడం కానీ, రీపోలింగ్ కానీ చోటుచేసుకోలేదన్నారు. ఓటర్ టర్నవుట్ చరిత్రాత్మకమని చెప్పారు. మూడో దఫా పోలింగ్‌లోనూ గరిష్టంగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. సెప్టెంబర్ 18, 25 తేదీల్లో మొదటి రెండు విడతల పోలింగ్ జరుగగా, మంగళవారంనాడు 40 నియోజకవర్గాల్లో తుది విడత పోలింగ్ జరుగనుంది. అక్టోబర్ 8న ఎన్నికల ఫలితాలు వెల్లడవుతాయి.

# పేద దళిత విద్యార్థికి సుప్రీం కోర్టు బాసట

**ధన్‌బాద్ ఐఐటి సీటు ఇవ్వాలని ఆదేశం**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 30(నమస్తే ఉదయం):** పేద దళిత విద్యార్థికి సుప్రీం కోర్టు బాసటగా నిలిచింది. ఐఐటీ ధన్‌బాద్‌లో సీటు సాధించినా గడువులోగా రూ. 17,500 ఫీజు కట్టలేక సీటు కోల్పోయిన విద్యార్థికి అడ్మిషన్ కల్పించాలని ఐఐటీ ధన్‌బాద్‌కు సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే ఫీజు చెల్లించకుండా గత మూడు నెలలుగా ఏమి చేస్తున్నారని విద్యార్థి తరపు న్యాయవాదులను ప్రశ్నించింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ జిల్లా టిటోరా గ్రామానికి చెందిన అతుల్‌కుమార్ రెండో, చివరి అవకాశంలో జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ప్రతిభ చాటి ఐఐటీ ధన్‌బాద్‌లో సీటు సాధించాడు. సీటు ఖరారు చేసేందుకు జూన్ 24 లోపు రూ. 17,500 ఫీజు కట్టాల్సి ఉండగా, దినసరి కూలీలైన అతడి తల్లిదండ్రులు గడువులోగా ఫీజు కట్టలేక పోయారు. దీంతో వారి నిస్సహాయతను చూసిన టిటోడా గ్రామస్థులు విరాళాలు వేసుకొని ఆ మొత్తం సమకూర్చారు. ఈలోగా ఫీజు గడువు ముంచుకు వచ్చింది. దీంతో చివరిరోజుల్లో సాంకేతిక కారణాలతో ధన్‌బాద్ ఐఐటీ ఆన్‌లైన్ పోర్టల్ పనిచేయక అతుల్ ఆ మొత్తాన్ని సకాలంలో కట్టలేకపోయాడు. సీటు వచ్చినట్టే వచ్చి చేజారింది. సాయం కోసం విద్యార్థి జాతీయ ఎస్సీ కమిషన్‌ను, జేఈఈ పరీక్ష ఝార్ఖండ్‌లో రాసినందున అక్కడి లీగల్ సర్వీసెస్ అథారిటీని ఆశ్రయించాడు. జాతీయ ఎస్సీ కమిషన్ చేతులెత్తేయగా ఝార్ఖండ్ లీగల్ సర్వీస్ అథారిటీ ఈ ఏడాది ఐఐటీ మద్రాస్ ఈ పరీక్ష నిర్వహించినందువల్ల మద్రాస్ హైకోర్టును ఆశ్రయించాలని సూచించింది.

# 55 రోజుల్లోనే డీఎస్సీ ఫలితాలు ఇచ్చాం..

**(మొదటి పేజీ తరువాయి)**
100 నియోజకవర్గాల్లో 20 నుంచి 25ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నాం.దపైలట్ ప్రాజెక్టుగా కొడంగల్ మధిరలో ఏర్పాటు చేస్తున్నాం. గత ప్రభుత్వం టీచర్ల పదోన్నతులు, బదిలీలు చేపట్టలేదు. మా ప్రభుత్వం వివా దాలకు తావు లేకుండా బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేసింది.

కొన్ని రాజకీయ పార్టీల మీడియాలు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులపై మాపై దుష్ప్రచారం చేస్తున్నాయి. పదేళ్లు ప్రభుత్వంలో ఉన్నవాళ్లు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిం చారు. అందుకే ఈ ఉపద్రవం వచ్చింది.. వాటన్నింటిని పరిష్కరించు కుంటూ మేం ముందుకెళుతున్నాం.విద్యపై పెట్టేది ఖర్చు కాదు.. పెట్టుబడి అని మేం భావిస్తున్నాం.విద్యార్థుల సంఖ్యతో ప్రమేయం లేకుండా ప్రభుత్వ పాఠాశాలలు నిర్వహిస్తాం. పేదలకు విద్య అందించడమే మా విధానం..

# రేవంత్ నీకు రేషం ఉంటే దిగిపో..

(మొదటి పేజీ తరువాయి)
చేశామని సిఎం కార్యాలయం ప్రకటించింది తప్ప ఎక్కడా లెక్కలు చెప్పలేదు. దమ్ముంటే ఎంత అయ్యిందో లెక్కలతో సహా ప్రజా పోర్టల్ లో పెట్టాలని డిమాండ్ చేస్తున్న. బిజెపి, మోడీ మాట ఇస్తే తప్పరు. ఎరువుల కోసం లైన్లు కట్టే దౌర్భాగ్య స్థితి లేకుండా... కాంగ్రెస్ మూసేసిన రామగుండం ఎరువల ఫ్యాక్టరీని 6300 కోట్లతో ప్రారంభించి తెలంగాణలో ఎరువుల కొరత లేకుండా చేసిన మహనీయుడు మోదీ. దేశవ్యాప్తంగా రైతులకు 6 వేల రూపాయలు ఇస్తున్న ప్రభుత్వం బీజేపీ. మిస్టర్ రేవంత్ రెడ్డి.. ఇంత పెద్ద నిర్ణయం తీసుకొనే ముందు ప్రజాప్రతినిధులను సంప్రదించావా ?

క్యాబినెట్ లో చర్చించావా ? మీఘా లకు చెప్పావా ? ఈయన్ను చూస్తే పేదల ఇళ్లను కూల్చి పేదల ఉసురు పోసుకున్న సంజయ్ గాంధీ గుర్తుకు వచ్చాడు. ఆయన వారసుడు ఈయన. హుస్సేన్ సాగర్ జలవిహార్, ప్రసాద్ ఐమ్యాక్స్, ప్యారడైజ్ ఎవరు కట్టారు. అవి వదిలిపెట్టి పేదల కొంపలు కూల్చే అధికారం నీకు ఎవడు ఇచ్చాడు. రెండింటి కోసం రేవంత్ ఇదంతా చేస్తున్నాడు. బిల్డర్ల దగ్గర డబ్బులు వసూలు చేసి హైకమాండ్ కి డబ్బులు పంపడానికి. మూసీ ప్రక్షాళన కాదు లక్షన్నర కోట్లలో వచ్చే కమీషన్ కోసం.

# బుల్డోజర్ పాలన ఆపమని రేవంత్‌కు చెప్పండి

**● తెలంగాణలో బుల్డోజర్ రాజ్‌పై లోక్ సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ జాతీయ నాయకులు రాహుల్ గాంధీకి మాజీ మంత్రి హరీశ్ రావు బహిరంగ లేఖ**



**హైదరాబాద్,సెప్టెంబర్ 30(నమస్తే ఉదయం):**
బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బుల్డోజర్ పాలన సాగుతోందని ఆరోపిస్తున్న మీరు.. మీ పార్టీ పాలిత తెలంగాణలో సాగుతున్న, అదే బుల్డోజర్ పాలనపై దృష్టి పెడితే మంచిదని కాంగ్రెస్ యువనేత రాహుల్‌గాంధీకి బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావు హితవు పలికారు. ఆ మేరకు ఆయన రేవంత్‌కు బహిరంగలేఖ రాశారు. లేఖ పూర్తి పాఠం ఇదీ..

తెలంగాణలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ఆధారంగా కాదు, అధికార దుర్వినియోగంతో దుర్మార్గ, దుష్ట పాలన నడుస్తున్నది. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మానవత్వాన్ని, న్యాయాన్ని బుల్డోజర్ కింద తొక్కి అణచివేస్తూ, రాజ్యాంగ విరుద్ధ చర్యలకు పాల్పడుతున్నది.

మూసీ రివర్ ఫ్రంట్ మరియు హైడ్రా ప్రాజెక్టుల విషయంలో నేడు హైకోర్టు చేసిన వ్యాఖ్యలే దీనికి నిదర్శనం.

మీ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నడుస్తున్న నిరంకుశ పాలనకు బుల్డోజర్ ప్రతీకగా మారింది. అది తెలంగాణలో పౌర హక్కులను నిరంతరం ధిక్కరిస్తోంది. హైడ్రా, మూసి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుల పేరుతో పేద, మధ్య తరగతి కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారు. ఏళ్లుగా అన్ని చట్టపరమైన పత్రాలతో నివసిస్తున్న వారి ఇళ్లను టార్గెట్ చేస్తూ, భయభ్రాంతులకు గురి చేస్తూ బుల్‌డోజర్ పాలన నడుపుతున్నారు.



బుల్డోజర్ విధానం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ క్రూరత్వానికి ప్రతిరూపంగా మారింది. అడుగడుగునా చట్టాలను తుంగలో తొక్కుతూ, సహజ న్యాయ సూత్రాలను కాలరాస్తూ మీ పార్టీ ముఖ్యమంత్రి పాలన కొనసాగుతుంది.

బుల్డోజర్లు 100 ఏళ్ల క్రితం నుంచి ఇళ్లను, కార్యాలయాలను, రహదారులను మరియు ఇతర నిర్మాణాలను నిర్మించడానికి ఉపయోగించారు. కానీ ఇప్పుడు జాతీయ పార్టీలైన బిజేపీ, కాంగ్రెస్ లు నిర్మాణాలను కూల్చేందుకు ఉపయోగించడం దుర్మార్గం.

ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, మధ్యప్రదేశ్, గుజరాత్, అస్సాం, మహారాష్ట్ర రాష్ట్రాల్లో పేదలు, మధ్య తరగతిపై బీజేపీ బుల్డోజర్లను ఎలా ఉపయోగిం చిందో, కాంగ్రెస్ కూడా తెలంగాణలో అదే విధంగా ఉపయోగిస్తున్నది. ఈ విషయంలో బిజేపీ దారిలోనే కాంగ్రెస్ నడుస్తున్నది.

బుల్డోజర్ కూల్చివేతల మీద సుప్రీం కోర్టు తాజా తీర్పు ఉన్నప్పటికీ, తగిన సర్వేలు నిర్వహించకుండా, సరైన విధానాలను అనుసరించ కుండా, కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో పేదల ఇండ్లను బుల్డోజ్ చేస్తూ, వారిని కన్నీరు పెట్టిస్తున్నది. భారత రాజ్యాంగంలో పొందుపరచిన సహజ న్యాయ సూత్రాలను మరియు చట్టాలను గౌరవించే విధంగా మీ ముఖ్యమంత్రికి సలహా ఇవ్వమని, తద్వారా రాష్ట్రంలో ఖూనీ అవుతున్న ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని మిమ్మల్ని ఈ లేఖ ద్వారా కోరుతున్నాను.




డిప్యూటీ కమిషనర్ రవికుమార్‌కు
వినతి పత్రం అందజేస్తున్న మైలార్ దేవపల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు ధనుంజయ్

# మార్కండేయ నగర్ సమస్యలు పరిష్కరించండి

**- డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు ధనుంజయ్**

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 30(నమస్తే ఉదయం):** మార్కండేయ నగర్ బస్తీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మైలార్ దేవ్ పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎన్ ధనుంజయ్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్ ను కోరారు. సోమవారం మైలార్దేవపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్ ధనుంజయ ఆధ్వర్యంలో మార్కండేయ నగర్ బస్తీలో నెలకొన్న డ్రైనేజీ, వాటర్ సమస్య మ్యానువల్స్, స్ట్రీట్ లైట్స్, సిసి రోడ్ల సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ రవికుమార్ మాట్లాడుతూ... ప్రజల నుంచి స్వీకరించిన వినతులను క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి సాధ్యమైనంత త్వరగా సమస్యలు పరిష్కరించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆర్గనైజర్ సెక్రెటరీ మాడిశెట్టి శ్రీనివాస్, పాండు, నరసింహ ,రత్నమ్మ, లలిత, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



పదవి విరమణ చేసిన మన్నె నర్సింగ్ రావు సన్మానిస్తున్న బాబురావు

# నార్మ్ ఉద్యోగి మన్నే నర్సింగ్ రావు పదవీ విరమణ

**నర్సింగ్‌రావు దంపతులను సన్మానించిన బాబురావు దంపతులు**

**బండ్లగూడ, సెప్టెంబర్ 30(నమస్తే ఉదయం):**
రాజేంద్రనగర్ లోని నార్మ్ లో యు డి సి గా పనిచేసిన మన్నె నర్సింగరావు సోమవారం పదవీ విరమణ చేశారు.నార్మ్ లో 40 సంవత్సరాలుగా విధులు నిర్వహించారు. కిస్మత్పూర్ ప్రాంతానికి చెందిన మన్నే నర్సింగ్ రావు ముదిరాజ్ ను పదవి విరమణ చేసిన సందర్భంగా తోటి ఉద్యోగులు, అభిమానులు కుటుంబ సభ్యులు దంపతులను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

# గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ)గా వి.లక్ష్మినారాయణ

**బాధ్యతలు స్వీకరించిన వి. లక్ష్మినారాయణ**

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 30,(నమస్తే ఉదయం):**
జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా వి.లక్ష్మీనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన చాంబర్‌కు చేరుకుని బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు ఆయన కలెక్టర్ బి.యం.సంతోష్‌ను క్యాంపు కార్యా లయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇంతకుముందు జిహెచ్ఎంసి, హైదరాబాదులో ల్యాండ్ అక్విజేషన్ విభాగంలో పనిచేసి జిల్లాకు అదనపు కలెక్టర్‌గా బదిలీపై వచ్చారు. ప్రస్తుతం అదనపు కలెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహించిన శ్రీనివాసరావు యధావిధిగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ల్యాండ్ అక్విజేషన్ గా బాధ్యతలు నిర్వహిస్తారు. కలెక్టరేట్ ఏ.ఓ. వీరభద్రప్ప కార్యాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు



అదనపు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలుకుతూ, శుభాకాంక్షలు తెలియజేశారు.

# చిన్న జీయర్ ఆశ్రమంలో విజయవంతం అయిన కేర్ ఆస్పత్రి సిపిఆర్ శిక్షణ కార్యక్రమం...

**శంషాబాద్,సెప్టెంబర్ 30( నమస్తే ఉదయం):**
శంషాబాద్ మండలం ముచ్చింతలలోని శ్రీరామనగరం చిన్న జీయర్ స్వామి ఆశ్రమంలో బంజారా హిల్స్ కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన సిపిఆర్ కార్యక్రమం విజయవంతం అయిందని కేర్ ఆస్పత్రి మెడికల్ హెడ్ డాక్టర్ అజిత్ సింగ్. మార్కెటింగ్ హెడ్ ఉదయ్. మార్కెటింగ్ ఇంచార్జ్ నాగరాజు తెలిపారు. కేర్ ఆస్పత్రి గుండె వైద్య నిపుణులు డాక్టర్ మల్ రెడ్డి హనుమంత రెడ్డి. చర్మ సౌందర్య నిపుణులు డాక్టర్ మిథిని రెడ్డి చిన్న జీయర్ స్వామి ఆశ్రమం ఆడిటోరియంలో ప్రపంచ హార్ట్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన సిపిఆర్ శిక్షణ అవగాహన కేంద్రంలో 3000 మందికి శిక్షణను ఇవ్వడం జరిగిందని




వారు తెలిపారు. 30 మంది శిక్షణ పొందిన సభ్యుల బృందం అంకిత భావంతో 3000 మందికి ప్రయోగాత్మకంగా శిక్షణను అందించినట్లు తెలిపారు. ఉదయం సెషన్లో జీవ. జీమ్స్ సిబ్బంది. శంషాబాద్ లోని వివిధ ఆస్పత్రుల నుండి వచ్చిన నర్సింగ్ సిబ్బంది ప్రభుత్వ ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడం జరిగిందని అజిత్ సింగ్. ఉదయ్. నాగరాజు తెలిపారు. గుండెపోటు మరణాలు తగ్గించాలని సదుద్దేశంతో చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన కేర్ ఆస్పత్రి డాక్టర్లు ఇతర సిబ్బందికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

# చలో లేబర్ కమిషనర్ ఆఫీస్ ముట్టడికి బయలుదేరిన కార్మిక సంఘాలు

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 30(నమస్తే ఉదయం):**
రాజేంద్రనగర్ మండలం, కాటేదాన్ క్లస్టర్ సిఐటియు రాజేంద్రనగర్ మండలం భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు బచ్చలకూర స్వామి. కార్యదర్శి వెంకటయ్య.కాటేదాన్. శ్రీనివాస్. క్లస్టర్ కోశాధికారి భాస్కర్ ల అధ్యక్షతన చలో లేబర్ కమిషనర్ ఆఫీస్ ముట్టడి కి బయలుదేరారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐటియు రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి అలీ దేవేందర్ ,జాజాల రుద్రకుమార్ హాజరయ్యారు. ద్విచక్ర, ఆటో, క్యాబ్, ర్యాలీని కాటేదాన్ పారిశ్రామిక ప్రాంతం స్వప్న థియేటర్ చౌరస్తా దగ్గర ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంటాక్ట్ వర్కర్స్ నాన్ పర్మినెంట్ ఎంప్లాయిస్ అందరినీ పర్మినెంట్ చేయాలి రాష్ట్రంలోని 73 షెడ్యూల్ ఎంప్లాయ్మెంట్ కనీస వేతనాల సమరించాలని ,పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెంచాలన్నారు. ప్రతి రంగంలో పనిచేసే కార్మికుడికి 26వేల రూపాయలు నిర్ణయించాలని, కార్మిక చట్టాలు పరిశ్రమలలో ఇతర అన్ని రంగాలలో అమలు చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికులందరికీ పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. కాటేదాన్ పారిశ్రామిక వాడలో ప్రాంతంలో ఎనిమిది గంటల పని దినాలు కావట్లేదు, 12 గంటల పని దినాలు చలామణి అవుతున్నాయని, ప్రభుత్వ అధికారులు వీటిని వెంటనే సందర్శించి ఎనిమిది గంటల పని గంటలు అమలు అయ్యేలా అధికారులు చొరవ చూపాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్మికుల చేత అదనపు పనికి అదనపు వేతనం చట్టం ప్రకారం డబుల్ ఇవ్వాలి, మహిళా కార్మికులకు విశ్రాంతి గదులు, పసిపిల్లలకు క్రేజ్ సౌకర్యం కల్పించాలి, లైంగిక వేధింపులు కార్మికుల లో అనేక రంగాల్లో జరుగుతుంది వాటిని అరికట్టాలి, వలస కార్మికులకు 1979 అంతరాష్ట్ర వలస




కార్మికుల చట్టాన్ని ఈ రాజేంద్రనగర్ మండల పరిధిలో ఉన్న అనేక పరిశ్రమలు, ఇతర కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ పరిధిలో అమలు చేయట్లేదు వెంటనే ఆ చట్టాన్ని అమలు చేయాలి, కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ లను ఉపసంహరించుకోవాలి, వాటి స్థానంలో గతంలో ఉన్న 44 కార్మిక చట్టాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు.ఈనెల 30న చలో లేబర్ కమిషనర్ ఆఫీస్ కోసం మనమందరం ఇప్పుడు ఈ ర్యాలీని ఇక్కడి నుండి ఆర్టీసీ క్రాస్ రోడ్ లేబర్ కమిషన్ ఆఫీస్ వరకు క్రమశిక్షణతో వెళ్లాలి మున్సిపాలిటీ, ట్రాన్స్పోర్ట్, భవన నిర్మాణ,వలస కార్మికులను, డంపింగ్ యార్డ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరారు. కొత్తగా ఏర్పడిన తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలి ఇప్పటికీ దాదాపు సంవత్సరకాలం కావస్తోందని, ఇప్పటివరకు అప్పుడు ఇప్పుడు అనే కాలయాపన చేశారు మీరు వెంటనే పరిష్కారం చేయకపోతే ఈ కమిషనర్ ఆఫీస్ ముట్టడే కాదు రాబోయే రోజుల్లో అనేక ఉద్యమాలకు సిద్ధం అవుతుందని హెచ్చరించారు. సిఐటియు కార్మికులందరూ ఎప్పటికప్పుడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తమ విధులు నిర్వహించుకుంటూ ఎప్పటికప్పుడు హక్కుల సాధన కోసం ఉద్యమానికి సిద్ధం కావాలని వారు. డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు రాజేంద్రనగర్ మండల నాయకులు ముజుబ్ ఖాన్. తోఫిక్. నరేష్. అక్రమ్. శివ .తిరుమలేష్. వెంకట్ రెడ్డి. హైమావతి. యాదమ్మ. మల్లేష్. ప్రవీణ్, సచిన్, శ్రీనివాస్ వీరితోపాటు 140 మంది పైచిలుకు కార్మికులు ఈ మహా ధర్నాకు బయలుదేరి వెళ్లారు.

# విద్యార్థులు, యువత 'మత్తు' బానిసలు కావొద్దు

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 30(నమస్తే ఉదయం):**
డ్రగ్స్‌కు అలవాటుపడి విద్యార్థులు, యువత జీవితాలను చిత్తు చేసుకోవద్దని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్ కుమార్ అన్నారు. నిషేధిత మత్తు పదార్థాల బహిష్కరణ కై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సోమవారం నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో గద్వాల పాత బస్టాండ్ నందు "ఒక్క రోజు నిరాహార దీక్ష" ను జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ...విద్యార్థి దశలో కొంతమంది సరదాగా చెడు స్నేహాల కారణంగా మత్తుకు అలవాటుపడుతారన్నారు. క్రమేపి వాటికి బానిసలై తమ జీవితాలనే నాశనం చేసుకోవడమే కాకుండా తమ కుటుంబాలను నష్టం చేసేలా మారుతారన్నారు. విచక్షణ కోల్పోయి ఏమి చేస్తున్నామో కూడా తెలియని విధంగా ప్రవర్తిస్తారన్నారు. మత్తుకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలన్నారు. జిల్లాను నిషేధిత మత్తు పదార్థాల భారిన పడకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉన్నదని అన్నారు.

జిల్లాలో అక్రమంగా గంజాయి వాడుతున్నారన్న వార్తల నేపథ్యంలో నిషేధిత ఆల్ప్రాజొలం, డైజోఫాం, సి.హెచ్ లాంటి వాడకం పెరుగుతున్న నేపథ్యంలో యువత వీటికి బానిసలయితే కుటుంబాలు విచ్ఛిన్నం కావడమే గాక సమాజ అభివృద్ధికి ఆటంకం కలిగించే అవకాశం ఉందన్నారు. మత్తు



పదార్థాలకు యువత బానిసలు కావద్దనే ఉద్దేశంతో వాటి వాడకం వల్ల కలిగే నష్టాలను ప్రజా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఒక్క రోజు నిరాహార దీక్షకు బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్తు ను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. గంజాయి మత్తు పదార్థాలు తీసుకోవడం వలన చిన్న వయస్సు లోనే అనారోగ్యాలతో మృతి చెందుతున్నారని అన్నారు. నిషేధిత మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమానికి ఒక్క రోజు దీక్ష చేపట్టిన రంజిత్ కుమార్ కు ధన్యవాదాలు తెలిపారు. జిల్లా లోని విద్యా సంస్థల సందర్శించి విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండే విధంగా జిల్లా ఉన్నతాధికారులు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బండల వెంకట రాములు, ఐటీ సెల్ కన్వీనర్ చిత్తారి కిరణ్, బిజెవైఎం నాయకులు గాంజా సాయి, మోహన్ రెడ్డి , నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు తదితరులు, పాల్గొన్నారు.

# శ్రీవారి మహా ప్రసాదం లడ్డూ అపవిత్రం చేస్తే సహించేది లేదు

**లడ్డు అపవిత్రం ప్రయత్నించిన టిటిడి బోర్డు సభ్యులను నిందితులుగా చేర్చాలి**



**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 30(నమస్తే ఉదయం):**
విశ్వహిందూ పరిషత్ ఆర్య నగర్ జిల్లా శ్రీ వెంకటేశ్వర స్వామి పవిత్ర ప్రసాదమైన లడ్డు విషయంలో జరిగిన అపవిత్రతను వ్యతిరేకిస్తూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అరంఘర్ చౌరస్తాలో రాజేందర్ నగర్ అసెంబ్లీ బొక్క బాల్ రెడ్డి మాట్లాడుతూ... తిరుమల తిరుపతి శ్రీవారి ప్రసాదం ఎంతో పవిత్రంగా భావి స్తాము అలాంటి లడ్డు ప్రసాదంలో జంతువుల కొవ్వుతో చేసిన నెయ్యిని కలిపారని అది మహా అపరాధమని అపరాధానికి పాల్పడిన పాల్పడిన పాలకులు, టిటిడి బోర్డు కమిటీ లో ఉన్న సభ్యులని దోషులుగా చేర్చాలి..

ఎందుకంటే హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా టిటిడి పాలకమండలి గత ప్రభుత్వం ఇలాంటి చర్యలకు కావాలనే ఇలాంటి చర్యలకు పాల్పడ్డట్టు రుజువు అవుతుంది ఇలాంటి చర్యలు రావటం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని గత ప్రభుత్వానికి ఇప్పుడు ఉన్న ప్రభుత్వానికి హెచ్చరిస్తున్నాం జగన్ మోహన్ రెడ్డి తెలియకుండానే ఇదంతా జరిగిందా ఇది కావాలనే చేస్తే మాత్రం నాశనమైపోతారు .ఆ కలియుగ వెంకటేశ్వర స్వామి వారిని క్షమించరు హిందువుల మనోభావులతోని ఆడిన ఆటలు చాలు అని హెచ్చరించారు .ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ రాహుల్ ,కిషన్ యాదవ్ ,రాహుల్ రెడ్డి, తోకల శ్రీనివాస్ రెడ్డి, వై శ్రీధర్ ,మల్లారెడ్డి, మల్లేష్ యాదవ్, మురళీధర్ రెడ్డి, సత్యనారాయణ, జనార్ధన్, కొమురయ్య, జగన్, వినయ్ రెడ్డి , శివ, మహేందర్ రెడ్డి ,విశ్వహిందూ పరిషత్ సభ్యులు, బజరంగ్దళ్ సభ్యులు పాల్గొన్నారు.

# సమయపాలన పాటించని ఉపాధ్యాయులు

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 30(నమస్తే ఉదయం):**
ప్రభుత్వ పాఠశాలలో సమయపాలన లేకుండా పోతోంది. ప్రభుత్వం ఉన్నత పాఠశాలలకు సమానంగా , ప్రైమరీ పాఠశాలలకు సమయాన్ని పొడగించిన ఉపాధ్యాయులు సమయానికి వెళ్లటం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. సోమవారం కేటిదొడ్డి మండలం రంగాపురం ప్రాథమికోన్నత పాఠశాలకు ఉదయం 9.30 గంటలు అయిన ఉపాధ్యాయులు ఎవరు విధులకు హాజరు కాలేదు. అదే సమయంలో పాఠశాలలను తనిఖీ చేయడానికి వెళ్లిన ఎంఇఓ వెంకటేశ్వరరావు విద్యార్థుల చేత ప్రార్థన చేయించారు. అలాగే, కర్ణాటక సరిహద్దులోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదన్న ఆరోపణలూ ఉన్నాయి. ముఖ్యంగా అధికారుల తనిఖీలు లేకనే ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని పలు గ్రామాల ప్రజలు అంటున్నారు. గ్రామీణ ప్రాంత ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమయపాలన నిబంధనలను తుంగలో తొక్కుతున్నారని మండల ప్రజలు విమర్శిస్తున్నారు. ఉపాధ్యాయులు ఉదయం లేటుగా వచ్చి సాయంత్రం మళ్ళీ గంట ముందు ఇంటి బాట



పడుతున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. సమయాపాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేశారు. ఈ విషయమై మండల విద్యాధికారి వెంకటేశ్వర రావును సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై వివరణ కొరగా అలాంటిది ఏమి లేదని ఉపాధ్యాయులు 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చారన్నారు. మండలంలోని మిగతా పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు సక్రమంగా విధులకు హాజరుకావడం లేదన్న ఆరోపణలు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# జర్నలిస్టుల సంక్షేమం కోసం పని చేస్తాం

**- టీయుడబ్ల్యూజే(ఐజెయు) రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 30(నమస్తే ఉదయం):** జర్నలిస్టుల సంక్షేమమమే ధ్యేయంగా టీయుడబ్ల్యూజే(ఐజెయు) పని చేస్తుందని రాష్ట్ర కార్యదర్శి , రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఎల్బీనగర్ నియోజకవర్గం కొత్తపేటలోని బాబు జగ్జీవన్ రామ్ భవన్ లో టియుడబ్ల్యూజే రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన వర్కింగ్ జర్నలిస్టుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జర్నలిస్టు ఇంటి స్థలాల దరఖాస్తు పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... జర్నలిస్టుల సంక్షేమం కోసం గత పది సంవత్సరాలుగా యూనియన్ అనేక పోరాటాలు చేసిందని అన్నారు. ప్రస్తుతం ఇండ్ల స్థలాల కోసం చేపడుతున్నటువంటి విలేకరుల వివరాల సేకరణ అనంతరం నియోజకవర్గాల వారీగా లిస్టులను తయారుచేసి మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డికి అందజేస్తామని స్పష్టం చేశారు. ఆయన నుంచి ప్రభుత్వానికి నివేదిక అందజేసేందుకు రాష్ట్ర యూనియన్ నాయకులు కృషి చేస్తున్నారని తెలిపారు. సంఘాలకతీతంగా నియోజకవర్గంలో పని చేస్తున్న అర్హులైన వర్కింగ్ జర్నలిస్టుల వివరాలను సేకరించాలని కోరారు. ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పినట్లు అసలు ఎవరు కొసరు ఎవరు అనేది తేల్చాల్సిన బాధ్యత మనపైనే ఉందన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే అర్హులైన జర్నలిస్టులను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఇంటి స్థలాలతో పాటు ఆరోగ్య భీమా కల్పన తదితర అంశాలపై పెద్ద ఏత్తున కసరత్తు జరుగుతుందని అన్నారు .త్వరలో జిల్లా కేంద్రంగా రాష్ట్ర స్థాయి పాత్రికేయుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి సీఎం రేవంత్ రెడ్డి మన సమస్యలు పరిష్కరించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు. ఆత్మీయ సమ్మేళనం విజయ వంతం చేయవలసిన బాధ్యత మన అందరి పైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా టియుడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షుడు కటకం సుభాష్, కోశాధికారి సంరెడ్డి శశి పాల్ రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు అనంతుల శ్రీనివాస్, సోలిపురం రజనీకాంత్ రెడ్డి, వర్దెల్లి దశరథ, రచ్చ శేఖర్, శ్యాం ప్రసాద్, జంగయ్య, చెప్పల శ్రీనివాస్, మేకల రవీందర్ రెడ్డి, చెరుకు వెంకట్ స్వామి గౌడ్, మధు, రమేష్, శ్రీనివాసరావు, రాజు, మహేష్, మట్ట అశోక్ గౌడ్, రాజేంద్ర నగర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, సూర్య నారాయణ, ప్రేమ్ ,చందు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



జర్నలిస్టుల ఇళ్ల స్థలాల దరఖాస్తు పత్రం నమూనాను విడుదల చేస్తున్న టియూడబ్ల్యూజే యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి

# సీఎంఆర్ బియ్యం సేకరణ వేగవంతం చేయాలి

**- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ (నమస్తే ఉదయం):** సి.యం.ఆర్. బియ్యం సేకరణ వేగవంతం చేయాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.

సోమవారం మధ్యాహ్నం కలెక్టర్ ఛాంబర్లో పౌర సరఫరాల శాఖ అధికారులతో సి.యం.ఆర్. రైస్ సేకరణ పై సమీక్ష నిర్వహించారు.

గత సమీక్ష సమావేశంలో మిల్లర్ల నుండి రోజు వారీగా సేకరించాల్సిన బియ్యం సేకరించేకపోవడంపై కలక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. బియ్యం ఇవ్వని రైస్ మిల్లులలో తనిఖీ చేయాలని ఖరీఫ్ సీజన్ లో ఇచ్చిన వడ్లు వాస్తవంగా ఉన్నాయా లేవా? అనేది తనిఖీ చేసి సరిగ్గా నిల్వలు లేకుంటే కేసులు బుక్ చేయాలని ఆదేశించారు.

రైస్ మిల్లుల తనిఖీ రెండు రోజుల్లో పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని, రైస్ మిల్లర్ల నుండి రైస్ ఇప్పించే బాధ్యత డిప్యూటీ తహసీల్దార్లు తీసుకోవాలని ఆదేశించారు. కాలయాపన చేసిన నిర్లక్ష్యం చేసిన చర్యలు తప్పవని సివిల్ సప్లై డి.టి.లను హెచ్చరించారు.

అక్టోబర్ 5న వరి కొనుగోలుపై జిల్లా స్థాయి సమావేశానికి ఏర్పాట్లు చేయాలి

వరి కొనుగోలు పై కొనుగోలు కేంద్రాల ఇన్చార్జిలకు, లారి ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లకు, వ్యవసాయ విస్తీర్ణాధికారులకు అక్టోబర్ 5వ తేదీన జిల్లా స్థాయి అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరుగుతుందని అందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పి.ఏ. సి.ఎస్, ఐ.కే.పి., మెప్మా, ట్రాన్స్పోర్ట్ తదితర సంబంధిన వారు ఎవరెవరిని, ఎంతమందిని పిలవాలో ప్రణాలిక చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా వరి దొడ్డు రకమా లేదా సన్న రకామా అనేది సాంకేతికంగా తెలుసుకోడానికి కొత్తగా డైల్ మైక్రో యంత్రాన్ని ప్రతి పి. ఏ.సి.ఎస్ కు ఒకటి చొప్పున



కొని వాడకం పై శిక్షణ ఇప్పించాలని ఆదేశించారు. ఈసారి సన్న రకం వడ్లకు ప్రభుత్వం తరపున క్వింటాలుకు రూ.500 చొప్పున ప్రోత్సాహకం ఇస్తున్నందున గతంలో కంటే రెండు మూడింతలు అధిక వడ్లు కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉన్నందున దాదాపు 300 వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అవసరమైన మేరకు గన్ని బ్యాగులు, తమ కొలిచే యంత్రాలు, తూకం వేసే యంత్రాలు, తాలు వేరు చేసేందుకు ఫ్యాన్ లు సమకూర్చుకోవాలని సూచించారు.అదనపు కలక్టర్ రెవెన్యూ యం నగేష్, జిల్లా సివిల్ సప్లయి అధికారి కాశి విశ్వనాథ్, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, జిల్లా మార్కెటింగ్ అధికారి స్వరన్ సింగ్, జిల్లా కో ఆపరేటివ్ అధికారి ప్రసాద్ రావు, జిల్లా తూనికలు కొలతల అధికారి డి. సత్యనారాయణ, డి.పి.యం. అరుణ, డి.యం. ఇర్ఫాన్, సివిల్ సప్లై డి.టి.లు తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగి మల్లేష్ పదవీ విరమణ సందర్భంగా సన్మానించిన అధికారులు, తోటి ఉద్యోగులు

# ఉద్యోగుల అంకితభావం, చిత్తశుద్ధి పనితనం వల్ల యూనివర్సిటీకి మంచి పేరు: రిజిస్ట్రార్ డాక్టర్ రఘురాం రెడ్డి

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 30(నమస్తే ఉదయం):** ప్రతి ఉద్యోగి అంకితభావం, చిత్తశుద్ధిలతో పనిచేయడం వల్లనే వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రగతి పథంలో సాగుతోందని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, పరిశోధన సంచాలకులు డాక్టర్ పి. రఘురామి రెడ్డి అన్నారు. వృత్తి, వ్యక్తిగత జీవితంలో ఎదురయ్యే సవాళ్లను సమర్ధవంతంగా ఎదుర్కొంటూ, ప్రతి ఉద్యోగి బాధ్యతలు నిర్వర్తించాలన్నారు. సోమవారం విశ్వవిద్యాలయంలో 28 ఏళ్లుగా ఆఫీస్ సబార్డినేట్ గా బాధ్యతలు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చేసిన కె మల్లేష్ వీడ్కోలు సభ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం రిజిస్టర్ డాక్టర్ రఘురాం రెడ్డి మల్లేష్ సుదీర్ఘ సేవలను అభినందించారు. ఆయనను సత్కరించారు. మల్లేష్ ఉద్యోగ విరమణ అనంతరం శేష జీవితం ఆరోగ్యం సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.





**అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘము**

# జిల్లా (ఐద్వా)నూతన కమిటీ ఎన్నిక

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 30(నమస్తే ఉదయం):** జిల్లా కేంద్రంలోని సీఐటియు కార్యాలయంలో సోమవారం రాష్ట్ర అధ్యక్షులు అరుణ జ్యోతి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా నూతన జిల్లా అధ్యక్షురాలుగా ఎమ్మెలమ్మ, జిల్లా కార్యదర్శిగా ఎ. నర్మద, జిల్లా ఉపాధ్యక్షులుగా రత్నమ్మ, పద్మ, జిల్లా సహాయ కార్యదర్శులుగా సమీరా, జయలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులుగా సుజాత, దేవమ్మ రాధ,మరియమ్మ, మాధవిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఐద్వా 2వ జిల్లా మహాసభల లో రాష్ట్ర అధ్యక్షులు అరుణ జ్యోతి మాట్లాడుతు మహిళలకు అనేక రకాల చట్టాలు ఉన్నప్పటికీ నేటికీ లైంగిక వేధింపులు దాడులు దౌర్జన్యాలు హత్యలు పెరుగుతున్నయాని, మహిళల కోసం పెట్టిన కొన్ని చట్టాలను గ్రామీణ స్థాయిలో అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని, పాలకులు గత ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన వాగ్దానాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా సంక్షేమం కోసం ప్రజా పాలన ప్రభుత్వమని చెబుతున్న మహిళలకు రక్షణ లేకుండా పోతుందన్నారు. 6 గ్యారంటీల పథకం సక్రమంగా అమలు చేయలేదని ఆరోపించారు. ప్రతి మహిళకు రూ.2500 నగదు చెల్లిస్తామని నేటికి అమలు చేయలేదన్నారు.

అక్టోబర్ 21, 22,23 తేదీలలో కొత్తగూడెంలోని రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో శివమ్మ, పావని, సుజాత, లక్ష్మి,రాధా తదితరులు పాల్గొన్నారు.

చెక్ డాం ప్రారంభించి బోర్డులో పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్



# సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు: ఎమ్మెల్యే జిఎంఆర్

**చెక్ డ్యామ్‌ను ప్రారంభించిన జిఎంఆర్**

**దేవరకద్ర, సెప్టెంబర్ 30(నమస్తే ఉదయం):** కౌకుంట్ల మండలం అప్పంపల్లి గ్రామం వద్ద ఊక చెట్టు వాగులో 12 కోట్ల 50 లక్షల (1200.50 లక్షల) రూపాయలతో నిర్మించిన నూతన చెక్ డ్యామ్ ను అధికారులు, స్థానిక నాయకులతో కలిసి దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం లో ఊక చెట్టు వాగుపై రెండు చెక్ డ్యామ్ లు శాస్త్రీయంగా నిర్మించడం జరిగిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని... కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని అందులో భాగంగా దేశ చరిత్రలో ఎన్నడు లేని విధంగా రైతన్నలకు ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేశామని, సాంకేతిక కారణాలతో రుణమాఫీ నిలిచిపోయిన రైతులకు కూడా త్వరలో రుణమాఫీ చేస్తామని తెలిపారు, గతంలో లక్ష రూపాయలు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన బిఆర్ఎస్ పార్టీ విడతల వారీగా రుణమాఫీ చేయడంతో అవి వడ్డీకే సరిపోయాయని బిఆర్ఎస్ పార్టీ మోసపూరిత వైఖరిపై ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మండిపడ్డారు.

## డీఎస్సీ ఫలితాల్లో మెరిసిన రైతు బిడ్డ

**- డీఎస్సీలో రెండో ర్యాంక్ సాధించిన ఎ.నరేష్**

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 30(నమస్తే ఉదయం):** తెలంగాణ రాష్ట్రంలో సోమవారం విడుదల చేసిన మెగా డీఎస్సీ ఫలితాల్లో జిల్లా ఓ నిరుపేద కుటుంబానికి చెందిన రైతు బిడ్డ రెండో ర్యాంక్ సాధించి, ప్రభుత్వ ఉద్యోగానికి అర్హత సాధించాడు. తెలంగాణ మెగా డీఎస్సీ ఫలితాలను సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేశారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రిజల్ట్స్‌ను రిలీజ్ చేశారు. ధరూర్ మండలం మార్లబీడు గ్రామానికి చెందిన ఎ.నరేష్ డీఎస్సీ పీఈటీ లో జిల్లా రెండో ర్యాంక్ సాధించాడు. పీఈటీలో 70 మార్కులు సాధించి జిల్లా రెండో ర్యాంక్ సాధించాడు. తల్లిదండ్రులకు వ్యవసాయమే ప్రధానవృత్తి. అర ఎకరా పొలంలో సీడ్ పత్తి పంటను సాగు చేసేవారు. తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటూ ఉన్నత చదువులు చదువుతూ మెగా డీఎస్సీ పరీక్షలు రాసాడు. తల్లిదండ్రుల కృషి ఫలితం, లెక్చరర్ల, స్నేహితుల ప్రోత్సాహంతో ఉద్యోగం సాధించినట్లు నరేష్ తెలిపారు. మార్లబీడు గ్రామానికి చెందిన నరేష్ రెండో ర్యాంక్ సాధించడం పట్ల ప్రముఖ సామాజికవేత చుక్క సుదర్శన్ రెడ్డి, మార్లబీడు గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.



మామ చుక్క సుదర్శన్‌తో డీఎస్సీలో ర్యాంక్ సాధించిన నరేష్

బ్రిడ్జి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



# భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఆర్.యు.బి. చేపట్టాలి

**- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**

**మల్కాజిగిరి, సెప్టెంబర్ 30(నమస్తే ఉదయం):** భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే విధంగా ఆర్ యు బి పనులు చేపట్టాలని మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం వాజపేయి నగర్‌లో చేపడుతున్న ఆర్.యు.బి. నిర్మాణ పనులను రైల్వే అధికారులు, జలమండలి, విద్యుత్ శాఖల అధికారులతో కలిసి బ్రిడ్జి పనులను ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... స్థానిక ప్రజల ఆస్తులు ఎక్కువగా కోల్పోకుండా, భవిష్యత్తులో ఇంకా ట్రాఫిక్ పెరిగే విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సరిపడే విధంగా ఆర్.యు.బి.నిర్మాణం చేపట్టాలన్నారు.

80 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులుతో జరగనున్న ఈ పనులు మూడు నెలల్లో ప్రారంభమయి, సంవత్సరం లోపు పూర్తవుతుందని ఎమ్మెల్యే అన్నారు.

ఈ కార్యక్రమంలో రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ సంజీవ్ కుమార్, రోడ్లు భవనాల శాఖ ఈ.ఈ. శ్రీనివాస్ మూర్తి, ఆర్ అండ్ బి జె ఈ రంజిత్, జలమండలి డీజీఎం రాజు మేనేజర్ నవీన్, విద్యుత్ ఏ డి ఈ యాదగిరి, ఏ ఈ గోపాల్, నాయకులు జగదీష్ గౌడ్, పరశురామ్ రెడ్డి, జె .ఎ. సి వెంకన్న , జి. కె హనుమంత్ రావు , రాము యాదవ్, ఉపేందర్ రెడ్డి, చిన్న యాదవ్ మధు సూధన్ రెడ్డి , సాయి గౌడ్, సూరి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**Printed and Published MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733